సంక్షేమ పథకాలు, పెన్షన్లతో లబ్ధి పొందుతూ రైతుకూలీ స్త్రీలు
పొలంపనులు మాని, వృత్తివ్యాపారాలు వదిలి శ్రమకు, కృషికి, సంసారానికి,
నైతికతకు దూరం కావడం, విలువలు దెబ్బతినడం బాధ కలిగించింది.
స్త్రీ ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తిగా ఉండాల్సిన ఆవశ్యకతను చెప్పడం కోసమే ఈ కథ.

కొలకలూరి ఇనాక్

11

# వృద్ధి





“మాకేం గాడు బట్టింది? మేం రాం,” అంది లింగి.

అంతకుముందు నారయ్య వచ్చి లింగిని, లింగి కూతురు సౌందర్యను కలుపు తీయటానికి రమ్మన్నాడు. కూలి ఎక్కువ ఇస్తానన్నాడు. కలుపు తీసిన రోజు సాయంకాలమే కూలి డబ్బులిస్తానన్నాడు.

“మనుషులు దొరకటంలేదు. కలుపు పెరిగిపోతా ఉంది. నువ్వా, నీ కూతురూ, ఇంకా ఇద్దరు వస్తే పని అయిపోద్ది,” అన్నాడు నారయ్య

“మా వల్లగాదు. మేం రాం,” అంది లింగి.

ఇంతకుముందు ఆసాములు వచ్చి పనికి పిలిస్తే చేతులు కట్టుకొని భయభక్తులతో, ‘అట్టాగే సోమీ! వత్తాం దొరా!’ అని పనికిపోయి, కూలి డబ్బు తెచ్చుకొని, వస్తూ బియ్యం బొయ్యం కొని తెచ్చుకొనేవాళ్లు.

ఆ పరిస్థితులు పోయి మేం పనికి రాం పొమ్మంటున్నారు. ఆసాములు వస్తే మంచం దిగి, చేతులు నలుపుకొంటూ నిలబడేవాళ్లు. ఇప్పుడు మంచం మీంచి లేవటం లేదు.

ఆసామి నిలబడి మాట్లాడుతుంటే, కూలీలు మంచం మీద కూర్చుని మాట్లాడుతున్నారు.

ఆసామి బతిమాలినట్లు మాట్లాడుతుంటే లింగి తుస్కారించి మాట్లాడింది.

“నువ్వా నీ పెళ్లమూ, నీ నలుగురు పిల్లలు వంగితే ఆ కలుపు తీయటం ఎంతసేపు?” అంది.

“అళ్లు పొలం పనులు ఎరగరే!” అన్నాడు ఆసామి.

“అళ్లేమో నీడ పట్టునుండాలా? మేమేమో ఎండనక వాననక పనిచేయాలా? మావల్లగాదు. పొండి.”

ఆసామి ఉసూరుమంటూ వెళ్లిపోయాడు. వేజండ్ల మాదిగపల్లెలో రైతుల పనులకు వెళ్లే మనుషులు తగ్గిపోతున్నారు. కొందరు పొగాకు కంపెనీల్లో గ్రేడింగుకు పోతున్నారు. కొందరు కట్టుబడి పనులకు పోతున్నారు. బేల్‌దార్లు, మేస్త్రుర్లు, కట్టుబడి కూలీలుగా వేజండ్ల మాదిగ

పల్లె మగవాళ్లు ఆరితేరారు. ఆ మగవాళ్ల భార్యలు, చెల్లెళ్లు, కూతుళ్లు మగవాళ్లతోపాటు కూలీలుగా ఇళ్లు కట్టే పనులకు పోతున్నారు. కొందరు ఆడవాళ్లు గుంటూరు మార్కెట్టులో కూరగాయలు, ఆకుకూరలు, పళ్లూ, చిరుతిళ్లు అమ్ముతూ అంతో ఇంతో సంపాదించుకొంటున్నారు. కొందరు బర్రెల్ని పెంచి, పాలు అమ్మి సుఖపడుతున్నారు. గుంటూరులో పాలకు ఎప్పుడూ గిరాకి.

రైతుల పొలాల్లో పనులకు వేజండ్ల మాదిగపల్లెలో రైతుకూలీలు లేరు. మగవాళ్లు లేరు. ఆడవాళ్లు లేరు.

ఏమీ పని చేయకుండా పల్లెలో, పాకల్లో ఒంటినిట్టాడి ఇళ్లలో నిద్రపోయే జనంలో ముసలీ ముతకను తీసేయగా కొద్దిమంది ఆడవాళ్లు కనిపిస్తారు. వాళ్లలో లింగి, లింగి కూతురు సౌందర్య కనిపించి ఆసామి కలుపుతీసే పనికి వాళ్లను పిలవ టానికి వచ్చి, పిలిచి రామనిపించుకొని వెళ్లిపోయాడు.

ఇదంతా వింటున్న చింతయ్య తాత దిగులుపడ్డాడు. తమ కాలంలో పనులు దొరక్క ఆసాముల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆసాములు రైతుకూలీల చుట్టూ తిరుగుతున్నారు. కాలమహిమ! అనుకొంటూ ఆశ్చర్యపోయాడు.

లింగికి ముప్పై ఏళ్లు. కూతురుకు పదిహేనేళ్లు. ఇద్దరూ ఏ పనీ చేయరు. కడుపునిండా తింటారు. కంటినిండా నిద్రపోతారు. నిద్రపట్టకపోతే గుంటూరు పోతారు. సినిమాలు చూచి వస్తారు.

ఇద్దరికీ భర్త లేరు.

లింగికి పదమూడో ఏట పెళ్లి చేశారు. పద్దానుగో ఏటికి భర్త చనిపోయాడు. అప్పటికి సౌందర్య కడుపులో పడింది. సినిమాల ప్రభావంతో కూతురుకు సౌందర్య అని పేరు పెట్టింది. లింగి సంసారంలో అంతా నొప్పి, అంతా బాధ. అంతా దుఃఖం అనుభవించింది. రెండేళ్ల కాపురం నరకం. సంసారం స్వర్గం అన్నవాణ్ణి చెప్పుతో కొడతాననేది లింగి.

భర్త తాగుబోతు. ఇల్లూ వళ్లూ గుల్ల చేసుకొని ఇరవై ఏళ్లకే వల్లకాటికి చేరాడు. భర్త చనిపోతే లింగి ఏడవలేదు. సంతోషించింది. 'పీడ ఇరగడయింది,' అనుకొంది. పెళ్లి బందిఖానాగా భావించిన లింగి విడుదల పొందింది. తాళి తెంచిన మూణ్ణెల్లకు కూతురు పుట్టింది.

సౌందర్య నిజంగా సౌందర్యవతి. మగవాళ్ల చూవులు, చూపులు కాదు, మర మేకులు. గుచ్చుకోసాగాయి.

యువకులు కొందరు కూతురు వెంట పడటం లింగి గుర్తించింది. వాళ్లను మాటలతో తరిమింది. కర్రలు చూపించింది. చెప్పులు తీసింది. రాళ్లు విసిరింది.

మగవాళ్లు దెయ్యాలు, రాక్షసులు, దుర్మార్గులు, దుష్టులు, ఆడవాళ్లను చంపటానికి పుట్టారని కూతురికి చిన్నతనం నుంచీ నూరిపోసింది. సౌందర్య నిజమే అని నమ్మింది. మగవాళ్లు అంటే గొంగళిపురుగులు అనుకోసాగింది.

కాని, జమాల్సుగాడు తేడాగా కనిపించాడు. వాడు ప్రేమగా, దయగా, జాలిగా, కరుణగా చూడటం గమనించింది. కొరుక్కు తినేట్టు, నమిలి మింగేట్టు, కోసుకు గుటుక్కుమనిపించేట్టు చూడటం లేదు. జమాల్సుగాడు సౌందర్యకు ఇష్టమయ్యాడు.

ఇంటి ముందున్న వేపచెట్టు కింద సూర్యుడు పుట్టక ముందు పుట్టేవాడు. సూర్యుడు అస్తమించక ముందే కనబడకుండా పోయేవాడు. జమాల్సుగాణ్ణి చూడకపోతే సౌందర్యకు నిద్రపట్టేదికాదు. వయస్సు, దాని దుంప తెంచింది. ఆడని ఆటలు లేవు. జమాల్సుగాణ్ణించి సౌందర్యకు, సౌందర్య దగ్గర్నుంచి జమాల్సుగాడికి తంతితపాలా సౌకర్యం ఎట్లా సాధ్యమయిందో కానీ, మాట్లాడుకోకుండా వాళ్ల సంభాషణ సాగింది.

“అణ్ణాకిష్టం,” అంది సౌందర్య.

నూరిపోసిన న్యాయసూత్రాలు, ధర్మసూక్ష్మాలు, మగవాడి రాక్షసత్వ రహస్యాలు ఏమయిపోయాయి అని లింగి తలకిందులుగా పడిపోయింది.

“అణ్ణీకు ఎందుకిట్టం?” అని లింగి అడిగింది.

“రైలు పెట్టెలోకి ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతమాలావు వేగంగా పోతున్నా, వస్తున్నా, ఎక్కుతాడు, దిగుతాడు,” అంది సౌందర్య.

‘అదేం అర్హత?’ అనుకొంది లింగి.

అయినా ఏమీ అనలేదు. నోరు నొక్కుకొంది. బుగ్గలు నొప్పి పుట్టాయి.

“రైలెక్కటం దిగటం గొప్పా?” లింగి ప్రశ్నించింది.

“జమాల్సుగాడు యమ ఉసారుగాడు,” అంది సౌందర్య.

పిల్లవాడు, పిల్ల పీటలేసుకొంటే పెళ్లి చేయకుండా ఏ తల్లిదండ్రులుంటారు? ఉండరు. ఉండరు కాబట్టి పెళ్లి అయింది.

పెళ్లయిన రెండోరోజు, రైలు ఎక్కటం దిగటం తనకు పెళ్లి చేసిన అదృష్టంగా భావించి, వేజండ్ల నుంచి తెనాలి పోతున్న రైలును గేటులో అందరూ చూస్తుండగా ఎక్కబోయాడు. అయితే ఏమయింది? ఎక్కలేకపోయాడు. ఎక్కలేకపోతే ఏమవుతుంది? కిందపడ్డాడు. కిందపడితే ఫరవాలేదు. రైలు చక్రాల కింద పడ్డాడు. రెండు ముక్కలయిన వాణ్ణి ఎవరేం చేసుకొంటారు? పాతి పెట్టారు. మూడోరోజు కార్యం కూడా కాలేదు. తాళి తెంచి పారేశారు.

సౌందర్యకు పెళ్లయినట్టా? కానట్లా? అని మాదిగ పెద్దలు తర్జనభర్జన పడ్డారు.

పెళ్లయిందని తీర్మానించి, విధవ అయిందని నిర్ణయించారు.

మొగుడు చస్తే ఆనందించినట్లే, అల్లుడు చస్తే కూడా లింగి ఆనందించింది.

సౌందర్య మాత్రం వేపచెట్టు కింద జమాల్సుగాడు కూర్చుని ఉన్నట్లే అనుకొంటూ కన్నీరు పెట్టుకొంది. కన్నీరు ఎండిపోయింది; ఇంకిపోయింది, మాయమయింది. సౌందర్యకు జమాల్సుగాడు కనిపించటం లేదు. ప్రేమ పోయింది. కోపం వచ్చింది. పూలు పెట్టుకోనీరు, బొట్టు పెట్టుకోనీరు. 'నీవే కారణమంతకు,' అని జమాల్సుగాణ్ణి తిట్టుకోసాగింది.

ఏతావాతా తేలిందేమిటంటే తల్లీకూతుళ్లిద్దరూ విధవలు. ఇద్దరూ వైధవ్యంలో సమానం.

కానీ లింగి ఒక తేడా గుర్తించింది. అదేమిటంటే, 'సౌందర్యకు నరకం తెలియదు. కడుపున ఒక కాయ కాయలేదు.'

అది లింగికి దుఃఖమే!

సౌందర్యకు సంతోషమూ లేదు. దుఃఖమూ లేదు.

ఒకరోజు చింతయ్య తాత వాళ్లిద్దరినీ పట్టుకొన్నాడు.

"ఆడు పట్టుకొంటే పల్నాటి శని పట్టినట్లే!" అంది లింగి.

అదేమీ సౌందర్యకు తెలియదు.

"ఒసీ! ఇద్దరూ కొవ్వు పట్టి ఉండారు. వంట్లో తీపరంగా ఉండదా?!" అని అడిగాడు.

"ఉంటది! అయితే ఏంటంట? ఆరుత్తావా? తీరుత్తావా? నోరు మూసుకొని పడుండరా ముసలోడా!" అంది లింగి.

వత్తాసు పలికినట్లు సౌందర్య నవ్వింది.

"మానన్నాక కాయలు కాయాలి. ఆడదన్నాక పిల్లల్ని కనాలి. మొద్దులాగా పడి ఉండరాదు," అన్నాడు తాత.

"ఒరే తాతా! నీకేవన్నా తిమ్మిరిగా ఉందా? తెగ నీలుగుతున్నావు? నన్ను జేసుకొంటావా? దీన్ని జేసుకొంటావా? ఏం జేసుకొంటావో సెప్పు," అని లింగి నవ్వింది.

వంత పాడినట్లు సౌందర్య నవ్వింది.

"ఓసి మీ దుంపల్‌దెగ, వయసు మీదుండారు. ఎవుళ్లనో ఏరుకొని కట్టుకొని, నలుగురు పిల్లల్ని కనండే నాయకురాళ్లరా!"

“మేఁమే దేశానికి బారమయ్యేము. మాకు తోడు పిల్లలు కూడానా? కనటం పెంచటం మా వల్లకాదురా ముసిలోడా!” అంది లింగి.

“ఆడదన్నాంక పిల్లల్ని కనితీరాలే దెయ్యాల్లారా! మొగుడూ మొద్దుల్లేకుండా ఆడుదుంటే ప్రతి పురుగూ కుట్టుద్దే సైతానుల్లారా!!” తాత కసిరాడు.

“సేసుకున్నది సాలు. సేసిన కావరాలు సాలు. ఇంకెందుకు లేనిపోని తిప్పలు?” అంది లింగి.

“ఆడది పిల్లోళ్లని కనిపెంచకపోతే సృష్టి ఎట్టా కొనసాగుద్ది? బమ్మ ఎట్టా బతికి బట్టకడతాడు?”

“మాకొద్దురా ముసిలోడా! ఈ తిప్పలు,” అంది లింగి.

“ఆడు కలుపు తీద్దురు రండే అంటే పోకపోతిరి. పెళ్లిలేక, పిల్లలు పుట్టక, ఒంటి కొమ్ము రాకాసులకు మల్లే ఆడోళ్లుండరాదే అంటంటే ఇనకపోతుంటిరి. ఎట్టా బతుకుతారే! బ్రతుకంటే ఏందే? కష్టపడాలి, కూడు తినాలి. ఇష్టపడాలి, పిల్లల్ని కనాలి. పనీపాటో సేయక, పిల్లా జల్లాను కనక ఉండీ మనుషులదేం పుటక? పుట్టేమి? పుట్టకేమి?”

“ఒకడికి చాకిరీ ఎందుకు సేయాలి? ఒకడికి పిల్లల్ని ఎందుక్కనాలి? ఏం తీటనుకుని సుఖంగా బతుకుతున్నాం మమ్మల్ని వదిలెయ్,” అంది లింగి.

“పనిసేయకపోతే నువ్వు పుట్టటం దండగ. పిల్లల్ని కనకపోతే ఆడమనిషి జీవించడం దుబారా! నువ్వు పనిచేసే శక్తివి మాత్రమేకాదు, పిల్లల్ని ఉత్పత్తి చేసే ప్రాణయంత్రానివి కూడా. కృషీలేక, ఉత్పత్తీ లేక బ్రతుకేమీ? చచ్చేమి?”

“పోరా ముసిలోడా! నీ గొణుగుడు ఎప్పుడూ ఉండేదే!?” అని లింగి, సౌందర్య అక్కణ్ణించి పోబోయారు.

“మిమ్మల్ని సృష్టించి, మీ అమ్మా అయ్యలే కాదు, దేవుడూ పొరపాటు చేసినట్లే! మీ అమ్మ అయ్యా వద్దనుకొంటే మీరు పుట్టేవాళ్లా? మేమే పనీ చేయమని, మేమే పిల్లల్నీ కనమని చెప్పే హక్కు మీకులేదు. పని చేస్తే ఉండే సుఖం, సంసారం చేస్తే ఉండే ఆనందం మీరు కోల్పోరాదు. నా మాట ఇనండి. తగిన జంటను వెతుక్కోండి. వాళ్లు ఎతుకుతుంటే మీరు అంగీకరించండి. పొండి!” అని కసురుకొన్నాడు చింతయ్య తాత.

“పని చేయటం కూటికోసమే కదా! సంసారం చేయటం కూటికోసమే కదా! వాడు తెస్తే వండిపెట్టి, తిని, వాడిపక్కలో పడి ఉండాలి. ఇంతేనా బతుకు? ఏ బాదరబందీ లేకుండా సుఖంగా ఉంటే నీకేం తిమ్మిరి తాతా?” ప్రశ్నించింది లింగి.

'ఇది బ్రతుకుగాదే బడవల్లారా?'' చింతయ్యతాత చుట్ట వెలిగించుకొన్నాడు.

అక్కణ్ణుంచి మెల్లగా ఇద్దరు సర్దుకొని తమ పాకకు చేరుకొన్నారు.

లింగి డ్వాక్రా గ్రూపులో సభ్యురాలుగా ఇంటింటికి తిరిగి కూరగాయలమ్మింది. ఇల్లు గడిచింది. బేంకు అప్పుతీరింది. ఇంత నిలవ ఉంది.

పిల్ల పెద్దదయింది. పెళ్లి చేసింది. వైధవ్యం కలిగింది. తనకు తోడయింది.

సౌందర్య మరో పెళ్లి అనలేకుండా ఉంది. లింగి కూతురు తోడు పోగొట్టుకోలేక పెళ్లి మాట ఎత్తటం లేదు.

సంబంధాలు కూడా రావటం లేదు. సౌందర్యను పెళ్లాడినవాడు చస్తాడని ఒక అకారణ భయం జనంలో నాటుకుపోయింది. లింగి మొండితనం బండతనం కూడా కొంత కారణం. సౌందర్య సాహసం వల్ల వాడు చచ్చిపోవటం మరో కారణం. మొత్తంమీద గోళ్లు ఊడగొట్టుకొని మోళ్లు మాదిరిగా మిగిలిపోయారు వాళ్లు.

విధవరాండ్రకు వచ్చే పెన్షన్ తల్లికి కూతురికీ వస్తూ ఉంది. వెయ్యి రెండు వేలు అయ్యేసరికి లింగి కూరగాయలమ్మే గంప మూలన పారేసింది.

నెలకు నాలుగు వేలు ఏం పని చేయకుండా వస్తుంటే ఇద్దరికీ ఆనందమే!

కే.జీ రెండు రూపాయల బియ్యం పదికేజీలు వస్తే వాళ్లకు నెలకు సరిపడా బియ్యం గింజలు ఇంటిలో ఉంటున్నాయి. చక్కెర, కందిపప్పు, చింతపండు సరుకులన్నీ చౌకధరకు లభిస్తుంటే నెలకు ఒక్క వెయ్యి రూపాయలతో కాలం గడుస్తూ ఉంది.

సౌందర్యకు పెళ్లి చేస్తే ఒక విధవరాలకి వచ్చే పెన్షన్ లేకుండా పోతుంది. లింగి ఒంటరిది అవుతుంది. రెండు ఇబ్బందులు, భయాలు.

సౌందర్యకు పెళ్లంటే భయం. తనను పెళ్లాడినవాడు అర్ధాంతరంగా చస్తాడన్న వదంతి అనుభవపూర్వకంగా సౌందర్య కూడా నమ్ముతుంది.

అమ్మ తోడుంటే అదే చాలు అనుకోసాగింది సౌందర్య. కూతురు వెంట ఉంటే అదే స్వర్గం అనుకోవటం లింగికి ఇష్టంగా ఉంది.

ఇద్దరూ టికెట్లు కొనకుండా గుంటూరు రైలు ఎక్కేవాళ్లు. ఎటో దిగి ఎటో వెళ్లేవాళ్లు. ఏ సినిమానో చూచేవాళ్లు. ఇంటికి వచ్చి వంటావార్పూ తంటా లేకుండా అన్న కాంటిన్లో పదిరూపాలతో కడుపులు నిండా తినేవాళ్లు.

ఎప్పుడన్నా గుళ్లో ప్రసాదంతో కడుపు నింపుకొనేవాళ్లు.

శనివారం అన్నదాన సత్రంలో తినగలిగినంత తినేవాళ్లు.

ఆదివారాలు చర్చి ప్రాంగణంలో సంతర్పణ ఉండేది.

వారంలో సగం రోజులు ఇంట్లో వంట చేయవలసిన పనిలేని సుఖజీవనం గడుపుతున్నారు వాళ్లు.

ఎప్పుడన్నా ఎవడన్నా మరీ వెంటబడుతుంటే బిచ్చగాడికి ఇంత బిచ్చం వేసినట్లు, ఊ కొట్టి వాడి కక్కుర్తి తీర్చి, వీళ్ల కుతి తీర్చుకొనేవాళ్లు.

వాళ్లిద్దరికీ వాళ్ల జాగ్రత్తలు తెలిసివచ్చాయి. కడుపో, కాలో రాకుండా ఉండా లంటే ఏం చేయాలో వాళ్లకు అర్థమయింది.

ఒకడే మరీ మరీ వెంటబడుతుంటే వాణ్ణి ఎట్లా దూరం చేసుకోవాలో కూడా అర్థమయింది. ప్రేమ అనీ, దోమ అనీ, భ్రమపడే ప్రమాదం నుంచి వాళ్లు తప్పించు కోవటం కూడా గ్రహించారు.

నెలకొక కొత్త చీరె కొనుక్కొంటారు. వెంటబడే వాడి సొమ్ము పైస ముట్టరు. వీళ్ల సొమ్ము పైస వాడికి పెట్టరు. తామరాకు మీది నీటిబొట్టు వ్యవహారం! జమాఖర్చు నిల్ బేలన్స్!

ఇక్కడితోనే సంసారమంటే విసుగు! రోత! అసహ్యం!

మనుషులు మారుతుంటే కొత్త ఎంతగానో ఉంటూ వచ్చింది. పాత అయితే రోత కాబట్టి, ఎవణ్ణి పాతబడకుండా చూచుకోసాగారు.

రోగం రొచ్చూ వస్తాయన్న భయం వాళ్లకు లేదు. తగిన ఏర్పాట్లు చేసుకో వటంలో ఆరితేరిపోయారు.

వాళ్లిద్దరికీ ఇప్పుడు మగాళ్లు, మగాళ్లులాగా కనిపించటం లేదు. కుక్కపిల్లల్లాగా భావించసాగారు.

బరువూ, బాధ్యతా, ఖర్చూ తలకాయనొప్పి లేని బంధాల వల్ల, ఇటు వీళ్లిద్దరూ, అటు మగపురుషులు, వెలుతురు చుట్టూ తిరుగుతూ మర్యాదగా మప్పితంగా, హద్దుల్లో ఉంటున్నారు.

చావటం లేదు, కాలి, మసై, మసై.

ఏదైనా పేచీ వస్తే వ్యవహారం పోలీసుల దాకా పోతుందని మగవాళ్లకూ భయం.

ఎవరికీ ఏదీ సొంతం కాదు కాబట్టి ఎవరి మధ్య ఎటువంటి పేచీలు తగాదాలు కొట్లాటలు లేవు.

కానీ వేజండ్ల పల్లెలో ఊరులో, గుంటూరులో వాళ్లిద్దరిని గూర్చి అనరాని మాటలు అనటం జనం విన్నారు. వీళ్లూ విన్నారు.

భోజనం చేసిన హోటలు, అన్నదాన సత్రం, చర్చి కంపౌండు, అన్న కాంటీన్ మర్చిపోయినట్లే, ఎదురయిన మగాళ్లు, మరుగయిన మగాళ్లు కాలగర్భంలో కరిగిపోతూ ఉన్నారు.

కానీ లింగీ, సౌందర్య ఆడవాళ్లు కదా!

అప్పుడప్పుడు ఆ మగాడు మేలు, ఈ మగాడు కీడు అని గుర్తించటం వల్ల మేలయిన మగాణ్ణి ఎన్నుకోవడంలో వాళ్లు చాకచక్యంగా ప్రవర్తించేవాళ్లు.

పెళ్లయితే ఒక్క మొగుడుతోనే సంసారం మొగుడు తుక్కోడయినా, దూగరోడయినా చచ్చినట్లు సంసారం చేయాలి.

వీళ్లకున్న వెసులుబాటు సంసార స్త్రీలకు లేదు.

ఒకరోజు చింతయ్య తాత వాళ్లిద్దరినీ పట్టుకొన్నాడు.

"ఏమే దయ్యాల్లారా?" అన్నాడు.

"ఏందిరా ముసిలోడా," అన్నారిద్దరు.

"మీ పని మా జోరుగా ఉందే!" అన్నాడు.

"ఉండక!" అన్నారిద్దరు.

"కోడలా! కోడలా! నీ బోగం ఎంతకాలమే అంటే మా అత్త ఊరి నుంచి వచ్చిందాకా అందంట కోడలు. అట్టాగే మీ బోగం ఎంతకాలం?" అన్నాడు చింతయ్య తాత.

"బుద్ధి పుట్టినంతకాలం!" ఇద్దరూ చెప్పారు.

"వయసు ఉడిగితే!!" చింతయ్య తాత అడిగాడు.

"మూలనపడి ఉండటం!" నిర్భయంగా చెప్పారు.

"ఎవరు చూస్తారు?" తాత ప్రశ్న.

"మమ్మల్ని మేం ఇద్దరం."

"మీరిద్దరూ మూలనబడితే?"

"ఏదోక ఆశ్రమానికి పోతాం!"

"మనిషిగా పుట్టినందుకు మీ గ్యాపకాలు ఈ నేలమీద ఏం వదులుతారు, మీ శవాలు తప్ప?"

లింగి, సౌందర్య మౌనంగా ఉన్నారు.

మళ్లీ చింతయ్య తాత అడిగాడు.

"వితంతు పెన్షన్లు ఆగిపోతే. 'వృద్ధాప్య పెన్షన్' అదీ ఆగిపోతే?"

"ఆగిపోదు!?"

"ఏం ఎందువల్ల?"

"మా ఓట్లు ఆళ్లకి కావాలి కాబట్టి."

"ఏ పెబుత్వం మిమ్మల్ని పని చెయ్యద్దు, పిల్లల్ని కనొద్దు అంటుంది? ఖాళీగా సోంబేరుల్లాగా ఉండమని ఏ పెబుత్వమన్నా చెబ్బుద్దా?" తాత ప్రశ్నించాడు.

"ఏ పెబుత్వమైనా అంటుంది. ఓట్ల కోసం, అధికారం కోసం వాళ్లేమైనా చేస్తారు. డబ్బులిస్తారు, డబ్బులు పంచుతారు. అయినా ముసిలోడా పెద్ద పెద్ద మాటలంటున్నావు. ఏడ నేర్చుకొన్నావు!!"

"మిమ్మల్ని చూసి... మీ చేత పనిచేయించే, మీ చేత పిల్లల్ని కనేట్టు చేసే పెబుత్వం రాత్రి నాకు కలలోకి వచ్చింది."

"మా సుఖం చూచి ఓర్చలేని ముసిలోడా! అందరూ చస్తున్నారు. నువ్వు చావవేం?!" లింగి, సౌందర్య తిట్టారు.

చింతయ్య తాత కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఎప్పుడూ నవ్వే తాత కళ్లు ఆరోజు నీళ్లతో నిండిపోతే తల్లీకూతుళ్లు తాతనేమీ అనలేకపోయారు.

లింగి గిన్నెలో అన్నం పెట్టి తాతకు ఇచ్చింది.

సౌందర్య చెంబుతో నీళ్లు తెచ్చి ముందు పెట్టింది.


"నన్ను బతికించగలరా?" చింతయ్య తాత అడిగాడు.

లింగీ, సౌందర్య అవునన్నట్లు తలలూపారు.

వాళ్లలో వచ్చిన మార్పుకు తాత ఆవురమని ఏడ్చాడు.

*సాహిత్యప్రస్థానం మాసపత్రిక*
*అక్టోబర్ 2019*

✻



1 జులై 1939న గుంటూరు జిల్లాలో పుట్టిన **కొలకలూరి ఇనాక్** మొదటి కథ ***లోకంపోకడ*** 1954లో గుంటూరు నుండి వెలువడిన ప్రజావాణి పత్రికలో అచ్చయ్యింది. బహుళ ప్రాచుర్యం పొందిన *ఊరబావి*తో సహా 15 కథాసంపుటాలు, 14 నవలలు, 39 విమర్శ, పరిశోధనా గ్రంథాలు, 15 కవితాసంపుటాలు, 45 నాటికలు-నాటకాలతో సహా మొత్తం 104 గ్రంథాలు ప్రచురించారు. విమర్శని వ్యాససంపుటికి 2017లో సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా రిటైర్ అయ్యారు.

**చిరునామా: 4-282, న్యూ సర్వోదయ నగర్, మీర్‌పేట, వైశాలీనగర్ పోస్ట్**
**హైదరాబాద్ - 500 072.**
***ఫోన్: 94402 43433*** ***k.enoch@yahoo.co.in***